నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | డిసెంబర్ 15, 2023 | www.navatelangana.com

గుర్తింపు ఎన్నికల్లో ఐక్యంగా విప్లవ సంఘాల పోటీ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా విప్లవ కార్మిక సంఘాలు ఐక్యంగా పోటీ చేస్తున్నట్లు విప్లవ కార్మిక సంఘాల ఐక్య కూటమి నాయకులు తెలిపారు. గురువారం నస్పూర్, శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విప్లవ కార్మిక సంఘాలైన తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(టీజీఎల్‌బీకేఎస్-ఐఎఫ్టీయూ), గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్-ఐఎఫ్టీయూ), శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఎస్జీఎల్‌బీకేఎస్-ఏఐఎఫ్టీయూ) ఐక్యంగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలు తీరాలంటే చక్రంలో సుత్తి గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విప్లవ కార్మిక సంఘాల నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, ఎండి చాంద్ పాషా, జి.రాములు, ఐ.కృష్ణ, పోచమల్లు, జే.సీతారామయ్య, డి బ్రహ్మానందం, ఎస్ మల్లేష్, నరేష్, టి శ్రీనివాస్ రత్నకుమార్‌రెడ్డి, జాఫర్, సంతోష్, మల్లన్న పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ సెంట్రల్ కార్యదర్శిగా రాపర్తి శ్రీనివాస్

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రానికి చెందిన రాపర్తి శ్రీనివాస్ ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ అందించారు. తనపై నమ్మకంతో సెంట్రల్ కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు. ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల పక్షాన ఉండి సమస్యలపై పోరాడి, పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.



దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- దివ్యాంగుల క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించాలని, దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలకు జిల్లా సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్యతో కలిసి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో దివ్యాంగులు అనేక రంగాలలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, ఇదే స్ఫూర్తితో జిల్లాలోని దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను, పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్, జావెలిన్ త్రో, మ్యూజికల్ చైర్ పోటీలలో జూనియర్, సీనియర్ విభాగాలు ఉంటాయని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి క్యారమ్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా క్రీడా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, దివ్యాంగుల సంఘాల నాయకులు మహేందర్, తిరుపతి, సతీష్, భాగ్య పాల్గొన్నారు.



క్రీడాకారులతో క్యారమ్ ఆడుతున్న కలెక్టర్

హక్కులు కొనసాగాలంటే టీబీజీకేఎస్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణిలో కార్మికుల హక్కులు ఎప్పటిలాగానే కొనసాగాలంటే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో టీబీజీకేఎస్ కార్యాలయంలో బుధవారం రాత్రి సింగరేణి కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా సింగరేణి కార్మికులకు హక్కులు సాధించి పెట్టారన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్ బాణం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి కార్యకర్త నిరంతరం పోరాటం చేయాలని ఆమె గుర్తు చేశారు. కోలిండియాలో లేని హక్కులు కేసీఆర్ నాయకత్వంలో సాధించడం జరిగిందన్నారు. జాతీయ కార్మిక సంఘాలు చేయలేని పనులు టీబీజీకేఎస్ సాధించిందన్నారు. బెల్లంపల్లి పట్టణంలో ఇండ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు లాభాల వాటాను కూడా పెంచి ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బోనస్ పెంచడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంఘం ప్రకాష్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు జెల్లి రాజలింగు, మంగీలాల్, మాజీ ఉపాధ్యక్షుడు నలగొండ సదాశివ్, రెబ్బెన జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, గోలేటి సర్పంచ్ పోటు సుమలత, జీఎం కమిటీ సభ్యులు కోగిలాల రవీందర్, చంద్రశేఖర్, మాన్కు సమ్మయ్య, మారిని వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చర్లపల్లి వనజ, మాజీ వైస్ చైర్‌పర్సన్ కుందారపు శంకరమ్మ, ఫిట్ కార్యదర్శులు కార్నాదం వెంకటేశం, మెరుగు రమేష్, ముర్ర శ్రీనివాస్, గుజ్జ శ్రీనివాస్, అనుముల సత్యనారాయణ మహేష్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి రిమ్స్‌లో ఘర్షణ..!

- వైద్య విద్యార్థులపై దాడి.. పలువురికి గాయాలు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా..మధ్యాహ్నం వరకు బైటాయింపు
- దాడికి పాల్పడ్డ వారిపై కేసులు నమోదు
- బాధ్యుడైన వైద్యుడి టర్మినేట్..విచారణ కోసం కమిటీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్ చేసిన ఘటన కలకలం రేపింది. క్యాంపస్‌కు సంబంధం లేకుండా బయట వ్యక్తులు హాస్టల్‌లో చొరబడి విద్యార్థులపై దాడులకు దిగారు. దీంతో రిమ్స్ విద్యార్థులకు, బయటి వ్యక్తుల మధ్య అర్ధరాత్రి ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణలో హౌజ్ సర్జన్లు కవిరాజ్, భరత్, నవీన్, అభిషేక్, పసుపులేటి నవీన్, డాక్టర్ విజయ్‌లకు గాయాలయ్యాయి. విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా రిమ్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులను కారుతో ఢీకొట్టి పరారయ్యారు. తమపై దాడి చేసి తప్పించుకునేందుకు యత్నించిన వారిపై వైద్య విద్యార్థులు పోలీసులకు అర్ధరాత్రి ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రిమ్స్ ఆవరణలో మోహరించి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడి ఘటనలో పాల్గొన్న వైద్యుడు క్రాంతికుమార్‌తో పాటు మరో ఇద్దరు వసీం, శివను అరెస్టు చేశారు. రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన కారులో వచ్చినట్లు పోలీసులు గుర్తించి ఆ కారును అదుపులోకి తీసుకున్నారు.

విధులు బహిష్కరించి.. దిష్టిబొమ్మ దహనం చేసి

రిమ్స్ డైరెక్టర్‌ను వసతులు కల్పించాలని కోరిన హౌజ్ సర్జన్లపై అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి కుమార్ బయట వ్యక్తులతో వచ్చి దాడి చేశారని మెడికోలు ఆరోపించారు. ఆయనను వెంటనే టర్మినేట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం విధులు బహిష్కరించి రిమ్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి ఎదుట క్రాంతి కుమార్, దుండగుల దిష్టిబొమ్మను దహనం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ అసోసియేషన్ రిమ్స్ అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ హాస్టల్ ఆవరణలో బయట వ్యక్తులు వచ్చి దాడి చేయడంతో తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. క్రాంతికుమార్‌తో పాటు మరో ముగ్గురు వచ్చి దాడికి యత్నించారన్నారు. వారిని ఆపే క్రమంలో కారును గట్టిగా పట్టుకున్నారని లేకపోతే ప్రాణాలు పోయేవన్నారు. దాడికి పాల్పడిన డైరెక్టర్ బంధువైన అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రిమ్స్ నుంచి నేరగా కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్, వైద్యుడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవీ వారి వద్దకు వచ్చి మాట్లాడటంతో శాంతించారు.

విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్

కలెక్టర్ రాహుల్ రాజ్ వచ్చి మెడికోలతో మాట్లాడారు. డైరెక్టర్ ఫ్యాన్స్ అంటూ తమపై దాడికి పాల్పడ్డారని, సమస్యలపై నిలదీసినందుకు డైరెక్టర్ సమీప బంధువు డాక్టర్ క్రాంతి బయట వ్యక్తులతో వచ్చి హాస్టల్‌లో తమపై దాడికి యత్నించారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ ఘటనపై విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని నియమించామని, దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. రక్షణ కల్పించేలా భద్రత చర్యలు మరింత పెంచేలా ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.



రిమ్స్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ శ్యామలదేవి, పక్కన డైరెక్టర్

మాజీ మంత్రి జోగు రామన్న మద్దతు

కలెక్టరేట్ ఎదుట మెడికోలు చేపడుతున్న ఆందోళనకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ హాస్టల్‌లో బయట వ్యక్తులు వచ్చి వైద్య విద్యార్థులపై దాడులకు పాల్పడిన ఘటనను ఖండిస్తున్నామన్నారు. డైరెక్టర్ ఫ్యాన్స్ అంటూ దాడికి దిగడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్యలను ప్రస్తావిస్తే దాడులు చేయిస్తారా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించి ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటి వరకు విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ధర్నాకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రి, ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ సైతం వైద్య విద్యార్థులకు మద్దతు తెలిపి ధర్నాలో కూర్చున్నారు.



కలెక్టరేట్ ఎదుట వైద్య విద్యార్థుల బైటాయింపు, మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

డాక్టర్ క్రాంతి కుమార్ టర్మినేట్

రిమ్స్‌లో జరిగిన ఘటనపై డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఛాంబర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. దాడికి కారకులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రాంతికుమార్‌ను టర్మినేట్ చేసినట్లు డైరెక్టర్ ప్రకటించారు. రిమ్స్ హాస్టల్‌లో బయటి వ్యక్తులతో వచ్చి డాక్టర్ క్రాంతికుమార్ దాడికి పాల్పడినట్లు మెడికోలు, హౌజ్ సర్జన్లు ఫిర్యాదు చేశారన్నారు. అదే విధంగా ఘటనపై పూర్తి విచారణకు పది మందితో కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో నివేదిక అందిస్తారని, దాని ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రిమ్స్‌లో సెక్యూరిటీని పెంచుతున్నామని, ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వారిపై కేసులు నమోదు : సీఐ

ఈ ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ అశోక్ మాట్లాడుతూ డైరెక్టర్‌ను సమస్యలపై అడిగినందుకు తమపై దాడికి యత్నించారని బాధితుడు కవిరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రాంతికుమార్, వసీం, శివతో పాటు మరొకరిపై కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు. దాడికి యత్నించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వివరించారు.



దాడిలో గాయపడ్డ వైద్య విద్యార్థి

ఆ ఇండ్ల కేటాయింపు ఎప్పుడో..?

- మొదటి విడత లక్కీ ద్వారా కొందరి లబ్ధిదారుల ఎంపిక
- నెలలు గడుస్తున్నా రెండో విడతకు లభించని మోక్షం
- ఏండ్లుగా వృథాగా డబుల్‌బెడ్‌రూమ్‌లు
- నిరుపేదలకు నెరవేరని సొంతింటి కల

నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడానికి అప్పటి ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లు వృథాగా ఉంటున్నాయి. నిర్మాణాలు పూర్తయిన వాటికి లక్కీడ్రా ద్వారా తొలి విడత లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా రెండో విడత ఎంపికకు మాత్రం ఇంకా మోక్షం లభించడం లేదు. ఆదిలాబాద్ పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్‌లు నిర్మించి ఏండ్లు గడుస్తున్నా నిరుపేదల దరికి చేరడం లేదు. ప్రభుత్వం అలసత్వం...అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు పడక గదుల ఇండ్లకు గ్రహణం వీడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మించిన వాటిలో నిర్వహణ సక్రమంగా లేక చాలా వరకు శిథిలావస్థకు చేరుతున్నా..అధికార యంత్రాంగం వాటిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క పాత ప్రభుత్వం మారిపోవడం.. కొత్తగా సర్కారు కొలువు దీరడంతో లబ్దిదారులు ఈ ఇండ్ల నిర్మాణాలపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటి పంపిణీపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.



కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో నిరుపేదల సౌకర్యార్థం ఆదిలాబాద్ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూంలు నిర్మించింది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ ఇండ్లను లబ్దిదారులకు కేటాయించడంతో అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలో రెండో చోట్ల 982 డబుల్ బెడ్‌రూంలను నిర్మించారు. గత రెండేండ్ల క్రితమే వీటి నిర్మాణాలు పూర్తిచేశారు. కానీ పంపిణీ ప్రక్రియ చేపట్టకపోవడంతో అప్పటి ప్రభుత్వంతో పాటు అధికారుల వైఖరిపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమైంది. గత ఆరు నెలల క్రితం జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో 36వార్డులకు రిజర్వేషన్ల వారీగా తొలి విడత లక్కీ డ్రా నిర్వహించారు. మిగిలిన వార్డులకు రెండో విడత లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం ఆరు నెలలు గడుస్తున్నా రెండో విడత లక్కీ డ్రా నిర్వహించడం లేదు. దీంతో ఇది వరకు లక్కీలో ఎంపికలో లబ్ధిదారులతో పాటు కొత్తగా ఆశలు పెట్టుకున్న అనేక మంది నిరుపేదలు ఈ ఇండ్ల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నారు.



రెండో విడత లక్కీ ఎప్పుడో..?

కిందటి ప్రభుత్వం నిర్మించిన ఈ ఇండ్లను అధికారులు లబ్ధిదారులకు కేటాయించడంలో తీవ్ర జాప్యం చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో 49వార్డులు ఉండగా వీటి పరిధిలో రూ.కోట్లు ఖర్చు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు 982 ఇండ్లు నిర్మించారు. తొలి విడతలో 36వార్డులకు గాను 618మందిని లక్కీ డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. రెండో విడతలో మిగిలిన 13వార్డులకు లక్కీ డ్రా నిర్వహించి మిగిలిన వారిని ఎంపిక చేయాలని భావించారు. కానీ వివిధ కారణాల రీత్యా లక్కీ డ్రా నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడంతో ఈ ఇండ్ల కేటాయింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అర్హులైన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరోపక్క ఈ ఇండ్ల కేటాయింపులో ఆలస్యం జరుగుతుండటంతో చాలా ఇండ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. పెచ్చులు ఊడిపోయి..విద్యుత్ వైర్లు తెగిపోయి..గోడలు కూలిపోయి అస్తవ్యస్తంగా మారుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆరోపణలున్నాయి.

పంపిణీ ఉంటుందా..?

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతాల్లో అనేక మంది నిరుపేదలు ఏండ్ల తరబడి గుడిసెల్లోనే నివాసముంటున్నారు. అనేక మంది అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక భారం భరిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఏండ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారు. అప్పటి ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూంలు కట్టిస్తామని భరోసానివ్వడంతో ఇండ్లు వస్తాయనే ఆశతో ఉన్నారు. జిల్లా కేంద్రంలో రెండు పడక గదుల ఇండ్లు కట్టించినప్పటికీ.. వాటిని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇంతలోనే ప్రభుత్వం మారడం.. కొత్త సర్కారు రావడంతో ఇది వరకు నిర్మించిన ఇండ్ల కేటాయింపుపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది వరకు చేపట్టిన ప్రక్రియ ప్రకారమే ఇండ్ల కేటాయింపు ఉంటుందా..లేదంటే కొత్త పద్ధతి ఏదైనా పాటిస్తారా అనేది అంతుబట్టని విధంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ ఇండ్ల కేటాయింపుపై దృష్టిసారించాలని అర్హులైన నిరుపేదలు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రక్తదానంపై ఉన్న అపోహలు వీడి యువత స్వచ్ఛంద రక్తదానికి ముందుకు రావాలని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత అన్నారు. గురువారం హెచ్‌డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం పలువురు విద్యార్థులు రక్తదానం చేయగా వారికి పండ్ల రసం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానంపై ఉన్న అపోహలను వీడేలా విద్యార్థులకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు.



చదువుతో పాటు లోకజ్ఞానం పెంచేలా పోటీ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చదువుతో పాటు లోక జ్ఞానాన్ని పెంచేలా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని మహాత్మ జ్యోతి బాపూలే డీసీఓ విద్య అన్నారు. గురువారం మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో వివేకజ్యోతి పోటీ పరీక్షలను నిర్వహించారు. స్వామి వివేకానంద రామకృష్ణ సేవా సమితి స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ విద్య మాట్లాడుతూ వివేకానంద జీవిత చరిత్రపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, కోరెడ్డి లెనిన్, ఉపాధ్యాయులు ఆశమ్మ, సరిత, స్వరూప, గీత పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ మండలంలోని పొచ్చెర, దిమ్మ గ్రామాల్లో గురువారం రైతుల పొలాల్లో శనగ పంటను డీఏఓ పుల్లయ్య పరిశీలించారు. పంటల దిగుబడులకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ అష్రఫ్ అహ్మద్, ఏఈఓ ప్రసాద్, రైతులు దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, అల్లూరి రాజురెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలో మండల విద్యావనరుల కేంద్రాన్ని గురువారం డీఈఓ రవీందర్‌రెడ్డి సందర్శించారు. భవనానికి సంబంధించి మేజర్, మైనర్ రిపేర్లను పరిశీలించారు. ఎమ్మార్సీలకు మంజూరైన కంప్యూటర్ ల్యాబ్‌ని పరిశీలించారు. యూడైస్‌కు సంబంధించి పాఠశాలల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు సంబంధించి యూడైస్ ఫామ్‌ని చెక్ చేశారు. వీరి వెంటా జిల్లా సెక్టోరల్ అధికారి రాజేశ్వర్, నారాయణ వర్మ, ఎంఈఓ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ విద్యార్థులపై దాడిచేసిన దుండగులను శిక్షించాలి

- వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలని సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ మెడికల్ కళాశాలలో బుధవారం రాత్రి చొరబడి మెడికల్ విద్యార్థులపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులకు రక్షణ కల్పించాలని, దాడిలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు క్యాంపస్‌లో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం బాధాకరమని తెలిపారు. దుండగులు ఎవరు పడితే వాళ్ళు ఎప్పుడు పడితే అప్పుడు క్యాంపస్‌లోకి పోయే అవకాశం ఉండటం చూస్తుంటే విద్యార్థుల భద్రత పట్ల అధికారులకు ఏపాటి చిత్తశుద్ధి వుందో అర్థం అవుతుందని పేర్కొన్నారు. దుండగులకు రాజకీయ అండదండలు ఉన్నట్టు తెలుస్తుందని, ఎంతటి వారినైనా సరే వదిలేయకూడదని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామంలో గురువారం యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అంటు వ్యాధులు, టీబీ, కుష్ఠి వ్యాధులపై అవగాహన కల్పించామని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. ఇందులో భాగంగా అపరిశుభ్రత ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎలాంటి సమస్యలున్న తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పుష్పలత, భగవాన్‌దాస్, సిబ్బంది, ఆశా సారిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

- సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ సహకార సంఘం సొసైటీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని సింగల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో అధికారులు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో తీసుకున్న వివిధ రకాల రుణాలను చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని అన్నారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో గృహ, మార్టిగేజ్, వ్యాపార అభివృద్ధి, పంట, వివిధ రకాల రుణాలు పొందవచ్చని అన్నారు. వర్షాకాలంలో పంట రుణాలు తీసుకున్న రైతులు వాటిని చెల్లిస్తే, తిరిగి యాసంగి పంటకు రుణాలు పొందవచ్చని అన్నారు. అలాగే కొత్త రైతులకు కూడా పంట రుణాలు తీసుకోవచ్చని అన్నారు. అనంతరం సొసైటీ ఆధ్వంలో తీసుకున్న పాత రుణాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ప్రహ్లాద్, డైరెక్టర్‌లు విజయలక్ష్మి, మధుకర్, మురళీ, చంద్రశేఖర్, ఆశన్న, దేవన్న, సీఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : డీఈఓ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

క్రీడలతో మానసికోల్లాసం కల్గుతుందని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చించోలి(బి) గ్రామ క్రీడా మైదానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి సాఫ్ట్ బాల్ అండర్-17 బాల, బాలికల ఆటల పోటీలు నిర్వహించారు. డీఈఓ క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతోపాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు పతాని రాధ, గ్రామ సర్పంచ్ లక్ష్మీ, మండల విద్యాధికారి మధుసూదన్, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ రమణారావు, సెక్టోరియల్ అధికారి రాజేశ్వర్, కార్యదర్శి భోజన్న, ఎస్ఎంసి చైర్మన్ సురేష్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కూన రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, అన్నపూర్ణ, బుచ్చి రామారావు, జమున పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ముధోల్ ఎమ్మెల్యేగా రామారావు పటేల్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-భైంసా

ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పవార్ రామారావు పటేల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం సభలోకి సహచర బీజేపీ ఎమ్మెల్యేలతో అడుగుపెట్టిన ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇదివరకే కాంగ్రెస్, ఎంఐఎం సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేయగా ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ సమక్షంలో తాము ప్రమాణ స్వీకారం చేయమని బీజేపీ ఎమ్మెల్యేలు తేల్చి చెప్పారు. స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టాకే ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని బంగారిగూడలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకి శోబా యాత్రను యాపల్‌గూడలో శ్రీవారి పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పల్లకి సేవలో ఎంపీపీ గంద్రత్ రమేష్ పాల్గొని, పల్లకిని మోశారు. కార్యక్రమంలో నరేశ్ పంతులు, గ్రామపటేల్ కొడప నారాయణ, గ్రామ పెద్ద కపూగంట జైరాం, ఉపసర్పంచ్ జయంత్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా పాయల శంకర్ ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల శంకర్ గురువారం జరిగిన రెండో శాసనసభ ద్వితీయ సమావేశంలో సభాపతి గడ్డం ప్రసాద్ ముందు ప్రమాణ స్వీకారం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. కాగా మొదటి సమావేశంలో ప్రొటెం స్పీకర్‌గా ఏంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ముందు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం బహిష్కరించగా రెండో సమావేశంలో చేశారు. అనంతరం విలేకరులతో పాయల శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇస్తున్న రైతుబంధును విడతల వారీగా కాకుండా ఇచ్చిన మాట ప్రకారం పూర్తి మొత్తాన్ని అందరికీ వెంటనే విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో బీజేపీ ప్రజా పక్షాన నిలబడి పోరాడుతుందని అన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐసీడీఎస్ అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని గర్భిణులకు, తల్లులకు, పిల్లలకు పౌష్టికాహారం అందేలా ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం ఐడీఓసీలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ప్రతి గర్భిణికి, తల్లులకు, పిల్లలకు అందేలా ఐసీడీఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా అనీమియా, సామ్ మామ్ పిల్లలపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలని అన్నారు. పెంబి, రాంనగర్, సారంగాపూర్, కడెం మండలాల్లో సూపర్‌వైజర్‌లు ప్రతి అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించాలని ఆదేశించారు. ప్రతి మండల సూపర్‌వైజర్‌లను ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. రిపోర్ట్సు సరిగా లేవని, అంగన్‌వాడీ సెక్టార్ వారిగా రిపోర్టులు అందజేయాలని అన్నారు. ఏఎన్‌సీ రిజిష్టర్ మెయింటెన్ చేయాలని సూచించారు. మొదటి, ఆదేశించారు. రేపటి నుంచి కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేయడం జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ తప్పనిస రెండో, మూడో చెకప్‌ల అనంతరం హైరిస్క్ ఉన్న వారిపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసినపుడు సరిగా రిజిస్టర్‌లు మెయింటెన్ చేయడం లేదని, ఫీల్డ్‌కి వెళ్లి పర్యవేక్షించాలనిరి అని అన్నారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటక్షన్, ఐసీపీఎస్, సీడబ్ల్యూ, సఖి కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశం లో డీడబ్ల్యూఓ రమేష్, డీఎంహెచ్ఓ దన్‌రాజ్, సీడబ్ల్యూఓ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సమ్మయ్య



మాట్లాడుతున్న ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య

నవతెలంగాణ-రెబ్బెన

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ సమ్మయ్య పేర్కొన్నారు. గురువారం ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు భయ్య మొగిళి ఆధ్వర్యంలో ఖైరిగూడ ఓసీపై గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల హక్కుల రక్షణకు, సంస్థ పరిరక్షణకు నిరంతరం పోరాడే సంఘానికి మద్దతు తెలపాలని కోరారు. సింగరేణిలో మొన్నటి దాకా బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్ మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీఆర్ఎస్ మాదిరిగానే రాజకీయ జోక్యంతో సంస్థను ఆర్థికంగా దోపిడీ చేయాలని ప్రస్తుతం కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మొన్నటి వరకు కార్మికుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోని యూనియన్ నాయకులు ఇప్పుడు కార్మికులకు మాయమాటలు చెప్పి ఓట్లు అడుగుతున్నారని, కార్మిక సోదరులు అన్ని విషయాలు గమనించి ఎల్లవేళల కార్మికుల పక్షాన ఉంటూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్న ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నో హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీకి మాత్రమే ఉందని, ప్రతి ఒక కార్మికుడి సొంతింటి పథకం కింద 250 గజాల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఏఐటీయూసీ సాధించిందన్నారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులకు, సూపర్‌వైజర్లకు, మైనింగ్ స్టాఫ్, ఈపీ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్, ఫిట్టర్స్‌కు సుటేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. నూతన బొగ్గు బావుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఏఐటీయూసీ విధివిధానాలు నచ్చి పలువురు ఖైరిగూడ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జూపాక రాజేష్, దివాకర్, కె కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, సివిల్ ఫిట్ సెక్రటరీ రఘునాథరెడ్డి, వర్క్‌షాప్ ఫిట్ సెక్రటరీ

వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆదర్శ బాలికల క్రీడల పాఠశాల మైదానంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి వికలాంగులకు నిర్వహించిన క్రీడలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడలను దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 10 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వరకు దివ్యాంగులకు పరుగు పందెం, షార్ట్ పుట్, క్యారమ్, చెస్, జావెలెన్ త్రో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, ఏటీడీఓ క్షేత్రయ్య, సంక్షేమ అధికారులు, పీడీలు, పీఈటీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి సంపూర్ణ మద్దతు

- మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై అవిశ్వాసం



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ అబ్దుల్ కలీంలపై అవిశ్వాసం అమలు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారిగా నిర్మల్ ఆర్డీఓ రత్న కళ్యాణి మున్సిపల్‌ను సందర్శించారు. గత నెలలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సంతకాలు ధృవీకరించడానికి ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి 9 మంది మున్సిపల్ కౌన్సిలర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. సంతకాల ధృవీకరణ అనంతరం నోటీసులు జారీ చేశారు. అనంతరం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం మాట్లాడుతూ గతంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియ మొదలవడం ఖానాపూర్ నూతన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సంపూర్ణ మద్దతుతో ఖానాపూర్ పట్టణంలో అభివృద్ధి చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు పరిమి సురేష్, నాయిని సంతోష్‌లు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్నామని పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కావలి సంతోష్, కిషోర్ నాయక్, కుర్మ శ్రీనివాస్, జన్నారపు విజయలక్ష్మి శంకర్, నాయిని స్రవంతి సంతోష్, పరిమి లత సురేష్, అఫ్రీన్ బేగం అమనుల్లాఖాన్, ఫౌజియా, షబ్బీర్ పాషాలు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆత్రం రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం మండలంలోని బెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అత్యంత వెనుకబడిన గిరిజన తెగకు చెందిన ఆదివాసులు ఖానాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారని వారి ఉన్నత విద్య అందని ద్రాక్షల మారిందని అన్నారు. వెంటనే ఖానాపూర్ నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయ్యే దిశగా ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృషి చేయాలని కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అన్ని గిరిజన గ్రామాలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ధర్నా



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని వారు అన్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని మండల ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం కనకపూర్ ప్రధాన కూడలిలో ధర్నా నిర్వహించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. నెలవారి అద్దె చెల్లించడం కష్టంగా మారుతుందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే మహిళలకు ఉచిత ప్రయాణం హామీని విరమించుకొని ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు పెన్షన్‌గా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు సమ్మెట రత్నయ్య, ఐఎఫ్‌టీయూజిల్లా కార్యదర్శి గంగన్న, డ్రైవర్ల సంఘం నాయకులు మోహన్, సాయన్న, రమణ, మహేష్, మండల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని చించుఘాట్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టేకం లక్ష్మి గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యారు. విషయం తెలుసుకొని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గురువారం పాఠశాలకు వెళ్లి బాలికకు అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఆదివాసీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడ రంగంలో రాణించడం చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-ముధోల్

ప్రజల కోసం కాంగ్రెస్ పని చేస్తుందని, ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ అన్నారు. గురువారం భైంసా పట్టణంలో ముధోల్ మండలం రాంటెక్ బీఆర్ఎస్ ఎంపీటీసీ ఆత్మ స్వరూప్, మచ్కల్ గ్రామ ఉపసర్పంచ్ కరీం 100 మంది కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం 6 గ్యారంటీల్లో ఇప్పటికే రెండు గ్యారంటీలను మొదటి రోజే అమలు చేసిందన్నారు. మిగతా వాటిని సైతం 100 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటుందని వెల్లడించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలు చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, మాజీ సర్పంచ్లు హనుమాన్లు, ముత్యంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌పై దాడి దురదృష్టకరం

- ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నరేష్ జాదవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి, నిర్మాణం చేపట్టిన పార్లమెంట్ భవనంపై దాడి జరగడం దురదృష్టకరమని ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కొత్త పార్లమెంట్ భవనంలో భద్రత వైఫల్యాలు లోపించడం శోచనీయమని అన్నారు. పార్లమెంట్ సభ్యులకే భద్రతలేకుంటే ఇక దేశంలోని 143 కోట్ల జనాభాకు ఏం రక్షణ కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైషమ్యాలు, వైరుధ్యాలు సృష్టించడం తప్పా బీజేపీకి దేశాన్ని మంచిగా పరిపాలించడం తెలియదని మండిపడ్డారు. హిందుత్వం పేరుతో మత ప్రాతిపదికన విభజించి పాలించడమే నరేంద్ర మోడి సర్కార్‌కు తెలిసిన విద్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేకిన్ ఇండియా నినాదంతో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తోందన్నారు. ఒకవైపు విదేశీ డాలర్ విలువ పెరుగుతుంటే మరోవైపు రూపాయి విలువ పడిపోతోందన్నారు. మరోవైపు తెలంగాణలో హస్తం పార్టీ అధికార ఏర్పాటుకు అవకాశం కల్పించిన యావత్ తెలంగాణ ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పాటిల్, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్, సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఎస్టీసెల్ జిల్లా చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు ఉన్నారు.

కోర్టు ఉత్తర్వులు పట్టించుకోని అధికారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఆర్టిఐ ద్వారా సమాచారం అందించని జిల్లా ఉపాధి కల్పనాధికారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టిఐ కార్యకర్త నోముల రాజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఉపాధి కల్పన శాఖ కార్యాలయం సిబ్బంది భానుకు పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి తిరుపతితో కలిసి హైకోర్టు ఉత్తర్వులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు సంబంధించి పూర్తి వివరాలను గతంలో ఆర్టిఐ ద్వారా అడిగానని తెలిపారు. దీనికి ఏజెన్సీలకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి ఎనిమిది వేల పేజీలు రిపోర్టు ఉందని, దానికి రూ.16వేలు డీడీ చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపినట్లు వివరించారు. డిడి తీసినప్పటికీ సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా, కోర్టులో జిల్లా అధికారి తరపున వాదించిన లాయర్ తానే కార్యాలయానికి రిపోర్టు కోసం రావడం లేదని కోర్టును తప్పుదోవ పట్టించారన్నారు. సమాచారం ఇవ్వాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కార్యాలయంలో సమర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారిపై చర్యలు తీసుకుని తనకు సమాచారం అందించాలని కోరారు. లేదంటే మరోసారి కోర్టు మెట్లు ఎక్కాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

ఇటీవల కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన మండలంలోని రైతులు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌ఫోటోలు జతచేసి దరఖాస్తు చేసుకోవాలని రైతులను కోరారు. ఇతర వివరాల కోసం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నూతనంగా ఎన్నికైన చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-వాంకిడి

నూతనంగా జిల్లా చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోనేరు కృష్ణను వాంకిడి జెడ్పీటీసీ అజయ్‌కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కౌటాల తహసీల్దార్‌గా శ్రీపాల్‌రెడ్డి

నవతెలంగాణ-కౌటాల



కౌటాల తహసీల్దార్‌గా శ్రీపాల్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కిరణ్‌కుమార్ కాగజ్‌నగర్‌కు బదిలీ కాగా కాగజ్‌నగర్ నుండి శ్రీపాల్ కౌటాలకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటానని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న గట్టు మహేందర్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(ఎస్సీకేఎస్-సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో సంవత్సర కాలం నుండి వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్ వివరాలను ఇవ్వాలని ఆందోళనలు, పోరాటాల ఫలితంగా గత నెల గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కమిషనర్ అన్ని జీఎం కార్యాలయాలకు కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను పంపించారన్నారు. అన్ని ఏరియాలలో జీఎం ఆఫీసుల నుంచి ఇప్పటికే కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను ఇవ్వడం జరిగిందని, కానీ శ్రీరాంపూర్ ఏరియాలో మాత్రం నెల రోజులు గడుస్తున్న పాస్ పుస్తకాలను ఇవ్వడంలో నిర్లక్ష్యంగానే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అన్ని ఏరియాల్లో కార్మికులకు వచ్చిన శ్రీరాంపూర్‌లో మాత్రం ఇవ్వకపోవడంతో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు అసహనానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వచ్చిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను కార్మికులకు అందించాలని కోరారు.

జిల్లా పరిషత్ చైర్మెన్‌గా కోనేరు కృష్ణ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన కోవ లక్ష్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవడంతో తన పదవికి రాజీనామా చేయగా వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న కోనేరు కృష్ణను జెడ్పీ చైర్మెన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నూతన చైర్మన్‌ను సన్మానించిన వారిలో సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్ వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, సర్పంచ్ భీమేష్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన చైర్మెన్

జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కోనేరు కృష్ణ జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్‌ను జెడ్పీటీసీలతో వెళ్లి కలిసి పుష్పగుచ్చం అందించారు. సభ్యుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విఠల్, మాజీ ఎమ్మెల్యే సక్కు, జెడ్పీటీసీలు నాగేశ్వరరావు, సంతోష్, అరుణ, ధృపదాబాయి, అజయ్ కుమార్, చంద్రశేఖర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి పాల్గొన్నారు.

సన్మానం కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న క్రిస్మస్ వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవ ప్రతిభ కనబరిచిన క్రైస్తవ సంస్థలను సన్మానించడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, సన్మానం కోసం నామినేషన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గలవారు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఎంఎఫ్‌సీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా నేరుగా జిల్లా కార్యాలయంలో ఈనెల 16 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాల కోసం సెల్: 8500723745 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సాహిత్య కళా ఉత్సవాలకు అధ్యాపకుడికి ఆహ్వానం

నవతెలంగాణ-దహెగాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా తాడెపెల్లి గూడెంలో శ్రీశ్రీ కళావేధిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం అందినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నోముల చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16, 17వ తేదీల్లో తాడెపెల్లి గూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో 30 గంటల పాటు నిర్విరామంగా సాహిత్య కళా ఉత్సవాలు కొనసాగుతున్నాయని, దీనికోసం శ్రీశ్రీ కళావేధిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి నుండి ఆహ్వానం రావడం ఎంతో సంతోషకరమన్నారు.

సమస్యలకు కేరాఫ్ బాబేఝరి ఆశ్రమ పాఠశాల

- రెండు గదులు.. ఐదు తరగతులు
- పనిచేయని సోలార్ హీటర్లు
- ఇబ్బందుల్లో గిరి విద్యార్థులు



బాబేఘరి ఆశ్రమ పాఠశాల



పని చేయని సోలాస్ సిస్టమ్

నవతెలంగాణ-కెరమెరి

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి అందించే ఆశ్రమాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. చిన్నపాటి సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేక విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. సరైన వసతి లేక ఆశ్రమ పాఠశాలలు అధ్వానంగా మారాయి.అధికారులు, పాలకులు ఇటువైపు దృష్టి సారించడం లేదు. దీంతో ఆశ్రమ పాఠశాలలు సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మండలంలోని బాబేఝరి ఆశ్రమ పాఠశాలపై ప్రత్యేక కథనం...

రెండు గదులు.. ఐదు తరగతులు...

బాబేఝరి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 132 మంది బాలబాలికలు విద్యానభ్యసిస్తున్నారు. పాఠశాలలో 5 తరగతి గదులు ఉండాల్సి ఉండగా, కేవలం 2 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో తరగతుల నిర్వాహణ ఉపాధ్యాయులకు కష్టతరంగా మారింది. తరగతి గదులు, డార్మేంటరీ గదులు సరిపడ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు పాలకులు అదనపు గదులు నిర్మాణం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు మండిపడుతున్నారు. 1, 2, 3 తరగతులను ఒక గదిలో 4, 5 తరగతులను మరొక గదిలో సబ్జెక్టులు బోధించడంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక తరగతికి భోదించే సమయంలో మరో తరగతి విద్యార్థులు వరాండాలో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆహ్లాదకరమైనటువంటి వాతావరణంలో విద్యా బోధనకు వీలుపడక విద్యార్థులు



సామాగ్రి మధ్యలో బోధన సాగిస్తున్న దృశ్యం

చదువుకు దూరం కావల్సివస్తుంది. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి అదనపు గదుల మంజూరుకు

చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

తరగతి గదులే డార్మేంటరీ

పాఠశాలలో రెండే తరగతి గదులు ఉండడంతో అదనపు గదులు లేక తరగతుల నిర్వహణతో పాటు అవే గదుల్లో పడుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతులనంతరం ప్రశాంతంగా నిద్ర పోవాల్సిన విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇరుకైన గదులు దానికి తోడు విద్యార్థుల పుస్తకాలు, సామాగ్రి ఆవే రెండు గదుల్లో సర్దుకు పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అదనపు గదులు మంజూరు చేయాలని గ్రామస్తులతో పాటు పాఠశాల సిబ్బంది పలు మార్లు ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోతుంది.

పని చేయని సోలార్ హీటర్లు

పాఠశాలకు లక్షలు వెచ్చించి 2 సోలార్ హీటర్ మెషీన్లు ఐటీడీఏ ద్వారా మంజూరు చేసినా ఉపయోగం లేకుండా పోతుంది. ఒకటి అంతంత మాత్రమే పని చేస్తుంది. మరో హీటర్ మరమ్మతులకు నోచుకోక మూలన పడ్డది. వాటిని పట్టించుకోనే వారు కరువయ్యారు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. అసలే చలికాలం.. నీళ్లను తాకితేనే వణుకు తప్పదు, అలాంటిది ఏకంగా అదే చన్నీళ్లతో తెల్లవారు జామునే స్నానం చేయాలంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చాలా కష్టం కానీ మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలలో పలు హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ఇటీవల ఏర్పడిన తుఫాను ప్రభావంతో చలి తీవ్రత మరింత ఎక్కువగా పెరిగింది. సోలార్ హీటర్లకు మరమ్మతులు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

కే జంగు, ప్రధానోపాధ్యాయుడు.



రోజువారి ఆహారంలో వివిధ రకాల కూరగాయలు, సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం నుండి తీసుకు రావాల్సి ఉంటుంది. విద్యార్థులు అనారోగ్యాల బారిన పడినప్పుడు ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్నా అదనపు భారం తప్పడం లేదు. సొంత ఖర్చులతో పెట్టినటువంటి డబ్బులు కూడా సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు తప్పడం లేదు. సకాలంలో బిల్లులు చెల్లించాలి.

అధికారులు పట్టించుకోవడం లేదు

పెందూర్ రాజేశ్వర్, గిరిజన సంఘం నాయకుడు



ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు యి రా జ్యా వే ం త ం న్న పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సమస్యల పట్ల దృష్టి సారించడం లేదు. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు లేవు. చలి కాలంలో వేడినీళ్ల కోసం సోలార్ హీటర్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. సోలార్ హీటర్లు పనిచేయక విద్యార్థులు చల్లటి నీళ్లతో స్నానం చేయాల్సి వస్తుంది. అధికారులు వెంటనే స్పందించి సోలార్ హీటర్లకు మరమ్మతులు చేపట్టాలి.

రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-కౌటాల

రేషన్ బియ్యం నిల్వ ఉన్న పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స అధికారులు గురువారం తెల్లవారు జామున దాడులు నిర్వహించి పట్టుకున్నారు. మండలంలోని గురుడుపేట గ్రామంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఎలుకుచ్చుల పోచన్న ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కౌటాల పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతనిపై కేసు నమోదుచేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. వారి వెంట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సీసీలు మధు, రమేష్, సంజీవ్ ఉన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుండి కార్మికులకు వేతనాలు రావడం లేదన్నారు. దీనితో కుటుంబ పోషణ భారంగా మారి రోడ్డు మీద పడే దుస్థితి నెలకొందన్నారు. కార్మికుల హక్కుల కోసం సమ్మె చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, కానీ జిల్లాలో నేటికీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అందించే సబ్బులు, నూనెలు, హ్యాండ్ బ్లౌజులు ఎప్పటికప్పుడు అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేదంటే మరోసారి ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మేజర్ పంచాయతీ అధ్యక్ష కార్యదర్శులు మాట్ల రాజు, సమ్మయ్య, నాయకులు మోతిరామ్, వినోద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం నిరంతరం కృషి చేయాలి



మూల్యంకన శిబిరాన్ని సందర్శించి సూచనలు చేస్తున్న డీటీడీఓ రమాదేవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలలు ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు(డీటీడీఓ) రమాదేవి అన్నారు. సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అమలు చేస్తున్న పదవ తరగతి వందరోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా నిర్వహించిన గ్రాండ్ టెస్ట్ పేపర్ల కోసం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మూల్యంకన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రాండ్ టెస్ట్ ఆధారంగా విద్యార్థుల స్థాయి నిర్ధారించి వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో 1173 మంది విద్యార్థులు మార్చిలో జరగబోయే పరీక్షలలో హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక సమయసారని పగడ్బందిగా అమలు చేయాలని ఆదేశించారు. రోజువారీగా స్లిప్ టెస్ట్‌లు నిర్వహించి మూల్యంకనం చేయాలన్నారు. ఉత్తమ ఫలితాల కోసం సమిష్టిగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు వెనకబిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారు రాణజంచేల కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, డీఎస్ఓ మీనారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు చింతగూడ విద్యార్థులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు చింతగూడ విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పెంటపర్తి అక్షిత, ఎనిమిదవ తరగతి విద్యార్థి సూరజ్ ప్రపుల్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఇటీవల జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని అక్షిత బంగారు పతకం, సూరజ్ వెండి పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని జిల్లా క్రీడ సమాఖ్య కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. గురువారం విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు మోహన్, పండరినాథ్, ప్రదీప్, శైలజ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించి గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎస్టీ మహిళను ఎన్నుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎస్టీ మహిళను ఎన్నుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. గురువారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం ఏజెన్సీ ఏరియాలో ఎస్టీ (మహిళ)కు రిజర్వ్ చేయబడ్డ స్థానంలో జనరల్ కేటగిరీకి చెందిన ప్రస్తుత జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు యిదిష్టారావును తాత్కాలికంగా చైర్మన్‌గా ఎంపిక చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. ఆదివాసులకు రాజ్యాంగ హక్కులను ఆధిపత్య వర్గాలు తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం ప్రతి చోటా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎటువంటి కాలయాపన చేయకుండా తక్షణమే ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి ఎన్నికలు నిర్వహించి మరో ఎస్టీ (మహిళ)ను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాజ్యాంగబద్ధంగా, చట్టప్రకారం ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి సిద్ధమన్నారు. అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీ మహిళను కాకుండా వేరే వారికి చైర్‌పర్సన్ పదవీ ఇవ్వడం ఆదివాసులకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఉపరితల గని అవసరాల కోసం విలువైన వ్యవసాయ భూములను దారాదత్తం చేసిన పరిసర గ్రామాల వారికి కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం అన్యాయమని బాధిత గ్రామాలు ఆరోపిస్తున్నారు. సింగరేణి ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్న పరిసర గ్రామావారు గురువారం ఇందారం ఓసీ వాహణాలను అడ్డుకున్నారు. స్థానికులకు అవకాశం కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి ఓసీ ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం పట్ల ఇందారం ఎంపీటీసీ అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక యువకులు ఓసీ వాహణాలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇందారం ఓసీ కాంట్రాక్టు పొందిన వరాహా సంస్థ నియమించుకున్న స్థానికేతరులను తొలగించి వారి స్థానంలో స్థానికులైన నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ స్పందిస్తూ ఇందారం ఓసీ ఉద్యోగాల్లో కొనసాగుతున్న స్థానికేతరులను పక్కన పెట్టి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో యువకులు నిరసన విరమించుకున్నారు.

4

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

శుక్రవారం | డిసెంబర్ 15, 2023 | www.navatelangana.com

మూతబడిన పాఠశాలను ప్రారంభించిన డీటీడబ్ల్యూఓ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మొర్రిగూడ గ్రామపంచాయతీలోని గోండుగూడ కాలనీలో మూతపడిన ఐటీడీఏ ప్రాథమిక పాఠశాలను గురువారం డీటీడబ్ల్యూఓ గంగారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే చదివు ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామన్నారు. మర్రిగూడ సర్పంచ్ గోపాల్, ఏసీఎంఓ రాజమౌళి, స్పెషల్ ఆఫీసర్ శంకర్, ఎస్సీ ఆర్‌పా రఘునాథ్, ఉపాధ్యాయులు సూరు, రాజారాం, గ్రామ పెద్దలు గంగారం పాల్గొన్నారు.

మోటర్ బిగించి నీటి సమస్యను తీర్చిన కౌన్సిలర్

నవతెలంగాణ-నస్పూర్



మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు హిమ్మత్ నగర్‌లో బోరుకు మోటరు బిగించి కౌన్సిలర్ లావణ్య దేవేందర్ స్థానిక ప్రజలకు నీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో ఉన్న ఎమ్మెల్యే దివాకర్ రావుకు అనేకమార్లు విన్నవించిన పట్టించుకోలేదని, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు కౌన్సిలర్ ద్వారా తెలియపరచడంతో కొత్త మోటర్ బిగించారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్ స్పందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవేందర్, స్థానికులు గజ్జి తిరుపతి, ఆవునూరు మహేష్, కంచు పోశం, తలారి వెంకటమ్మ అవునూరి భాగ్య, గోపిడి విజయ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-తాండూర్

ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తాండూర్ శాఖ మేనేజర్ మహేంద్ర కుమార్ సూచించారు. గురువారం ఖాతాదారులకు సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. బ్యాంకు సేవలు అందించే విషయంలో అధికారులు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు . తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ రాయితీ కల్పిస్తుందని, బీమా సౌకర్యాలు, బంగారు ఆభరణాలపై, వ్యవసాయ, పొదుపు సంఘాల రుణాలు వంటి అన్ని సేవలను ఆర్‌బీఐ నిబంధనల మేరకు అందిస్తున్నట్టు తెలిపారు. బ్యాంకుసేవలపై కళాకారులు అవగాహన కల్పించేల ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ గీత, ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక , రైతులు, సహాయక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సెంట్రల్ కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవన్‌లో సెంట్రల్ సెక్రటరీగా ఎన్నికైన రాపర్తి శ్రీనివాస్ కాంగ్రెస్, ఐఎన్టీయూసీ నాయకులతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ, 2వ గనుల్లో కార్మికులను అందరినీ కలుపుకొని వెళ సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ మాట్లాడుతూ పార్టీ అత్యధిక మెజార్టీతోని గెలవడం జరిగిందని, కార్మికులు ఐఎన్టీసీని భారీ మెజార్టీతో గెలిపిస్తే కార్మికుల హక్కులు అమలు జరుగుతాయన్నారు. మాజీ సహకార చైర్మెన్ పూస్కూరి వంశీకృష్ణ రావు మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉండే ఐఎన్టీయూసీకి కార్మికుల మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, మాజీ సర్పంచ్ ఉత్తూరి సత్తయ్య, నాయకులు నస్పూరి నర్సింగ్, సామ లక్ష్మణ్, మడావి వెంకటేష్, కోడూరి మునీందర్, తొంగల కుమారస్వామి, నక్క హరీష్, ఆల్క రాజు, అడిచర్ల రాజేశం, కొత్త రమేష్, చంద్రయ్య, బలరాం, మధుకర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీని గెలిపిస్తే రాజకీయ జోక్యాన్ని అడ్డుకుంటాం



IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE
AT: MANCHERIAL
O.S.No. 223 OF 2023

Between:

1. Elluturi Laxmi, W/o. Srinivas Rao, Age.44 years, Occ. House wife, R/o. ND 2956, Nagarjuna colony, Naspur, Mancherial district.
2. Elluturi Kalyan, S/o. Srinivas Rao, Age.29 years, Occ.: Private employee, R/o. ND 2956, Nagarjuna colony, Naspur, Mancherial district.
3. Elluturi Ravali, D/o. Srinivas Rao, Age.27 years, Occ.: Student, R/o. ND 2956, Nagarjuna colony, Naspur, Mancherial district.

...Plaintiff No. 1 to 3

AND

1. The Singareni Collieries Company Limited, Rep by its General Manger, SRP Area, Srirampur, R/M. Naspur, Dist Mancherial.
2. All Concerned.

... Defendant

Whereas the above plaintiffs have filed a suit for declaration of status against you and the said suit is posted on 04.01.2024 for your appearance.

Therefore you are directed to be present either in person or through advocate at above 10.30 am on 04.01.2024 before the said court answering the claim. Failing which the matter will be heard and determined in your absence.

"By Order of the court"

Siva Rama Krishna.s
Advocate
Mancherial
Cell:9849421421

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికలలో సింగరేణి వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నీ గెలిపిస్తే రాజకీయ జోక్యాన్ని అడ్డుకుంటామని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య అన్నారు. గురువారం ఆర్కే 5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపిస్తే రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడమే కాకుండా సంస్థ మనుగడకు తోడ్పడుతామన్నారు. కార్మికుల హక్కులన్నీ కాలరాయపడ్డాయని, రాజకీయ జోక్యం పెరగడం వల్లనే సంస్థ ఆర్థికంగా నష్టపోయిందని, మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులు స్థాపించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించి, లాభదాయకమైన అనేక హక్కులను సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, నాయకులు చంద్రమోహన్, సంపత్, ప్రసాద్ రెడ్డి, సారయ్య, నరసింహారావు, లక్ష్మణ్, గజ్జి రమేష్, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు ఇంటి స్థలాలివ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-కాసిపేట



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని సోమగూడెం(కే) గ్రామపంచాయితీలో గల సర్వే నంబర్ 146/14లోని ప్రభుత్వ భూమిని కబ్జాకు గురైందన్నారు. ప్రభుత్వ భూమిని కేకే ఓసీ పరిధిలో లేకున్నా ఉన్నట్టు నకిలీ పత్రాలు సృష్టించి పరిహారం పొందిన వారిపై చర్య తీసుకొని, భూమిని ఇళ్ల లేని పేదలకు పంచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం ట్యాంక్ బస్తీ గ్రామం ఏర్పాడక ముందు ఈ స్థలానికి సింగరేణి డబ్బులు చెల్లించి వారి పరిధిలోకి తీసుకొని నీలగిరి చెట్లుపెట్టారని తెలిపారు. కానీ 1991లో సింగరేణిలో పని చేస్తున్న దుబ్బగూడెం, కాసిపేట, వరిపేట గ్రామాలకు చెందిన కార్మికులకు ఇంటి సౌకర్యం కల్పించకపోవడంతో ఇక్కడే సొంతంగా ఇళ్ల నిర్మాణం చేసుకొని ఉంటున్నారన్నారు. అప్పటి అధికారులు జోక్యం చేసుకొని ప్రభుత్వ అవసరాల కోసం, పోలీసు క్వార్టర్ల నిర్మాణం కోసం సుమారు 8 ఎకరాలు భూమిని తీసుకొని హద్దులు పెట్టారని, భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉండగా ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన సోమగుడెం(కే) గ్రామ పంచాయతీ క్రీడా మైదానం, గ్రామపంచాయతీ కార్యాలయం కోసం అధికారులు కేటాయించారన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మిగిత భూమిని కొంత మంది రాజకీయ నాయకులు బినామీ పేర్లతో కబ్జా చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలు లేని పేదలకు పంచాలని, 35 సంవత్సరాలుగా పేదలు పోరాడుతున్నారని, ఈ భూమిని కబ్జాదారుల పలు కాకూడదని గత నెలలో ఫిర్యాదు చేశామన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. కేకే ఓసీ పరిధిలో లేకపోయినా కూడా 2017లో తప్పుడు పత్రాలు ద్వారా చెల్లించిన పరిహారాన్ని రికవరీ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కాసిపేట సర్పంచ్ భూక్య చందూలాల్, సోమగుడెం(కే) ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, యూత్ నాయకులు అజ్మీర రాజా, అజ్మీర రవి, శివసాయి, ఇస్లావత్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సర్పంచులను ఆదుకోవాలి

- పదవీ కాలం కష్టనష్టాల్లోనే గడించింది.. మరో ఐదేండ్లు అవకాశం ఇవ్వాలి
- మంత్రి సీతక్కను కలిసిన సర్పంచులు



మంత్రి సీతక్కను కలిసిన సర్పంచులు

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ సర్పంచులుగా ఎన్నికై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచుల సంఘం నాయకులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూర్య(సీతక్క)ను కలిసి విన్నవించారు. మండల పరిధిలోని గ్రామాలకు చెందిన సర్పంచులతో పాటు తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన సర్పంచులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసినట్లు తెలిపారు. సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు భూమన్న యాదవ్, మహిళా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులు, వాటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు విషయాన్ని మంత్రికు వివరించినట్లు రామారావుపేట్ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి తెలిపారు. కరోనా కాలంలో రెండు సంవత్సరాలతో పాటు మూడు సంవత్సరాల్లో వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులు కొనసాగించామన్నారు. సర్పంచులుగా ఎన్నికై పదవులు చేపట్టిన సర్పంచులు గత ప్రభుత్వంలో సేవకులుగా కొనసాగిన తీరు బాధాకరమని పేర్కొన్నారు. గడిచిన కాలంలో ఆర్థికంగా నష్టపోయిన సర్పంచుల పదవీ కాలం ఒక సంవత్సరం పొడిగిస్తూ గతంలో తెచ్చిన చట్టం ప్రకారం మరోమారు ఎన్నికల్లో పోటీ చేయడం కోసం రిజర్వేషన్ యధావిధంగా కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. సర్పంచుల సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని, సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేంగా సర్పంచుల ఇబ్బందులు తీసుకెళ్తానని సీతక్క హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన స్మశాన వాటికలు, రైతు వేదికలు, డపింగ్ యార్డులు, క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు సంబంధించి లక్షల్లో అప్పులు చేసిన సర్పంచుల సమస్యను అసెంబ్లీలో చర్చించాలని విన్నవించినట్లు తెలిపారు.

హనుమాన్ ఆలయ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని నంనూరు పునరావాస కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా బేర పోచయ్య, పెద్దపల్లి స్వామీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఒడ్డె బాలరాజు, సహాయ కార్యదర్శిగా వడ్డే శ్రీనివాస్, కోశాధికారిగా కారుకూరి తిరుపతి, కార్యనిర్వహక సభ్యులుగా అత్తె తిరుపతి, ఒడ్డె రాజమౌళి, ఆకిరెడ్డి వెంకటేష్ ఎన్నికయ్యారు. ఎన్నికలకు పరిశీలకులుగా రాసమల్ల శ్రీనివాస్ గౌడ్, గోపు లింగయ్య వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ శివరాత్రి వరకు గుడి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-హాజీపూర్

గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో దొనబండ పోస్ట్ ఆఫీస్ ఎదుట గురువారం తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ బ్యాంక్ సేవక్స్, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు ఆందోళన బాటపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడీఎస్‌లకు 8 గంటల పని నిర్ణయించాలని, పెన్షన్‌తో పాటు అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలన్నారు. టీఆర్సీఏ రేషనల్ ఫిక్సేషన్ సహా కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, రెగ్యులర్ ఎంప్లాయిస్‌కు ఇచ్చినట్లు వెయిటేజి, ఇంక్రిమెంట్స్ సీనియర్స్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెయిడ్ లీవ్స్ 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలని, జీడీఎస్ కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కాంట్రిబ్యూషన్ 3 శాతం నుండి 10శాతానికి పెంచి రిటైర్డ్ జీడీఎస్‌లకు హడాక్ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. బిజినెస్ టార్గెట్‌ల పేరుతో వేదించే పద్ధతులు, సొంత మొబైల్ ఫోన్‌లను ఉపయోగించాలనే ఒత్తిడిని తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయమైన కోరికలను తీర్చాలన్నారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగులు రజని, సంధ్య, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, భూమయ్య, శంకరయ్య, అశోక్, భాషమియా పాల్గొన్నారు.


జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఆశా వర్కర్లు గురువారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్)2023 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వేను రెండు దశల వారిగా చేపట్టడం జరుగుతుందని, రాబోయే రెండు నెలలలో వైద్య పరీక్షలు నిర్వహించబోయే వైద్యాధికారులకు ఈ సర్వే తోడ్పడుతుందని తెలిపారు. ఈ కుటుంబ ఆరోగ్య సర్వేలో భాగంగా పట్టణంలో ఆరోగ్య-అనారోగ్య కుటుంబ వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లావణ్య, ఆశా వర్కర్ ఎస్.తిరుమల, ఐటీ పర్సన్ ఎన్. వెంకటేష్, మ్యాపర్ సీహెచ్.రాంబాబు, లిస్టర్ బి.తిరుపతి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



నవతెలంగాణ-జన్నారం

పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, డీటీడీఓ మాధవి, ఏసీఎంఓ స్పెషల్ ఆఫీసర్ గంగారం అన్నారు. గురువారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. సందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు స్లిప్ టెస్టులు పెడుతూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహజంచాలని జీఎం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ యాజమాన్యం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రగతి స్టేడియంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, కార్యాలయంలో ఉదయం జెండా ఆవిష్కరణ తరువాత ప్రగతి స్టేడియంలో జెండా ఆవిష్కరణ, స్టాల్స్ ఓపెనింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉత్తమ గృహాలకు బహుమతులు, ఉద్యోగుల సన్మానం ఉంటుందన్నారు. దానికి అగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం శ్రీనివాస్, వి పురుషోత్తమ రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్ సింగ్, రాముడు, డీజీఎంలు అరవింద రావు, ఆనంద్ కుమార్, చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, శ్యామ్‌సుందర్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ మూలంగానే సింగరేణికి నష్టం



నవతెలంగాణ-నస్పూర్

ఇంతకాలం గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ మూలంగానే సింగరేణికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, కలవని శ్యామ్ అన్నారు. గురువారం ఆర్కే-7 గనిపై ఐన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు జెట్టి శంకరరావు అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొన్నటి వరకు గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ నాయకుల వైఫల్యాలు అవినీతి, అక్రమాల మూలంగానే సింగరేణి సంస్థకి కార్మికులకి తీవ్రని అన్యాయం జరిగిందని, సింగరేణిలో కాంట్రాక్టీకరణ పెరిగిందని దీన్ని ఆపాలంటే ఐఎన్టీయూసీని గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సింగరేణి కార్మికులకు 45 డిమాండ్లతో కూడిన మేనిఫెస్టోని కార్మికుల ముందుకు తీసుకువచ్చిందన్నారు. జనక్ ప్రసాద్ నేతృత్వంలో నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్ల నుండి 100 మంది కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఉప ప్రధాన కార్యదర్శులు గరిగె స్వామి, తిరుపతిరెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, కార్యదర్శులు సమ్ము రాజయ్య, మోతె రాఘవరెడ్డి, ఎల్ శ్రీనివాస్, ఏరియా కార్యదర్శులు సమ్మిరెడ్డి, మహేష్, కొలిపాక సమ్మయ్య, వెంకటస్వామి, రౌతు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్, నాయకులు శ్రీకాంత్, రాజు, వెంకటేష్, జీవన్ రావు, పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



నవతెలంగాణ-దండేపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 13వ విడత ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మార్చ్ 31 2023 వరకు వివిధ గ్రామపంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులను సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించారు. ఈజీఎస్ అధికారులు వెల్లడించిన వివరాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి నమోదు చేసుకున్నారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి మాట్లాడుతూ కేవలం మొక్కలు నాటడంపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారని, రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు పనులు చేపట్టేందుకు చొరవ చేసుకోవడంలేదని, రైతులకు ఉపాధి హామీ ద్వారా పనులు జరిగేలా చూడాలన్నారు. మండలంలో ఏవైనా నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపడితే అట్టి పనులకు సంబంధించిన నిధులను రికవరీ చేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ సామాజిక తనిఖీలో ఎంపీడీఓ మల్లేశం, ఉపాధి హామీ ఏపీఎం దుర్గదాస్, ఆయ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరణ చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దుద్దిళ్ల శ్రీధర్ బాబును కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.



ఓటరు నమోదు...సవరణలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-జూలపల్లి
జూలపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయం, జూలపల్లి నందు ఓటర్ల జాబితా సవరణ-2024 గురించి జూలపల్లి మండల బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో తేది 01.01.2024 వరకు 18 సం.లు నిండే వారందరిని ఓటరు జాబితాలో నమోదు చేయించాలని, ప్రస్తుత ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సవరించాలని తహసీల్దార్ బషీరుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబూబకర్, ఆర్ఐలు సదయ్య సంపత్ బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్ రావు



నవతెలంగాణ-రామగిరి
సింగరేణి సేవా సమితి ద్వారా అందిస్తున్న పలు వృత్తి శిక్షణ తరగ తులను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు మెరుగుపర చుకోవాలని సింగరేణి ఆర్జీ-3 ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ అలివేణి సుధాకర్ రావు అన్నారు. గురువారం సెంటినరీ కాలనీలోని సేవా భవన్‌లో టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటీషియన్ మొదలగు విభాగాలలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు ఎన్ అలివేణి సుధాకర రావు, ఏపీఏ జీఎం సతీమణి కె.విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం 2000 సంవత్సరం డిసెంబర్ 10న ఏర్పాటు చేయబడిన సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా సభ్యులందరూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సింగరేణి సేవా సమితి ద్వారా అందిస్తున్న పలు ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా సమితి సమన్వయ కర్త బి.రాయమల్లు, కె.సుధాకర్‌లతోపాటు సేవా సభ్యులు, శిక్షకులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

లొంకకేసారం అభివృద్ధికి నిధులు కేటాయించండి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతి అందజేత



కలెక్టర్ వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ ఎండీ మంజూర్

నవతెలంగాణ-రామగిరి
రామగిరి మండలంలోని లొంక కేసారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం బ్రిడ్జి,వీధి దీపాల కోసం ప్రత్యేక నిధుల కేటాయించాలని, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు లొంకకేసారం సర్పంచ్ ఎండీ మంజూర్ వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని లొంక కేసారం, కల్వచర్ల రెండు గ్రామాలకు సంబంధించి రైతులు, ప్రజల రాకపోకలకు వీలు లేకుండా మధ్యలో వాగు ఉన్నందున వాగు పైన బ్రిడ్జి వేసి లొంక కేసారం ఖబ్రస్తాన్ నుంచి పెద్దమ్మతల్లి టెంపుల్ మీదుగా మరుతినగర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. అదేవిధంగా లొంక కేసారంలోని క్రీడా ప్రాంగణం నుంచి వైకుంఠధామం వరకు నిత్యం రైతులు,ప్రజలు వెళ్ళే ప్రధాన రహదారి సరిగా లేనందున రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలు లేకపోవడం, వర్షాకాలం సమయంలో రహదారి బురదమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే వైకుంఠధామానికి వెళ్లడానికి వీలు లేకుండా మధ్యలో ఉన్నటువంటి ఎస్సారెస్పీ కెనాల్ పై ఉన్న చిన్న బ్రిడ్జిని కాస్త వెడల్పు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాని కలెక్టర్‌కి తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్డు నిర్మాణం, వీధి దీపాలు, బ్రిడ్జి కొరకు నిధులు కేటాయించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు.

బాలవికాస నీటి శుద్ధికరణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ ఓదెల:
ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో రిటైర్డ్ టీచర్ కాసర్ల నరేందర్ రెడ్డి తన భార్య పూలమ్మ జ్ఞాపకార్థం సుమారు నాలుగు లక్షల రూపాయలతో బాలవికాస నీటి శుద్ధికరణ కేంద్రం షెడ్‌ను నిర్మాణం చేసి ఇచ్చాడు. నిర్మాణం చేసిన షెడ్డులో బాల వికాస నీటి శుద్ధికరణం కేంద్రాన్ని ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసర్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నా భార్య పూలమ్మ జ్ఞాపకార్థం గ్రామంలో నీటి శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటు చేయుటకు ప్రజలకు ఉపయోగపడే విధంగా షెడ్డు నిర్మాణం చేసి ఇచ్చానని గ్రామస్తులు సహాయంతో నిడిచిపెట్టి కరుణ కేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, సీనియర్ మేనేజర్ కందుల ప్రతాప్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వై బాల మోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం వాటర్ ప్లాంట్, షెడ్ నిర్మాణ దాత నరేందర్ రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు.



కాసర్ల నరేందర్ రెడ్డి సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆశలన్నీ దుద్దిళ్లపైనే...

- మంత్రి శ్రీధర్ బాబు ముంగిట సవాళ్లు



నవతెలంగాణ-మంథని
మంథని నియోజకవర్గంలో ఐదుసార్లు గెలిచి తిరుగులేని నేతగా ఎదిగిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమైన ఐటీ శాఖ పదవి దక్కింది. అయితే శ్రీధర్‌బాబు ముందు అనేక సవాళ్లున్నాయి.2014 నుంచి 2023 వరకు తొమ్మిదిన్నర ఏళ్ల గత ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక సమస్యలతో అతలకుతలం కాగా మంథని నియోజకవర్గ అభివృద్ధి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి.గత సర్కార్ పాలనలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి నియోజకవర్గ అభివృద్ధి వైపు దృష్టి సారించిన దాఖలాలు లేవు. మంథని నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన గత ప్రభుత్వ యంత్రాంగం సరిగ్గా పనిచేయలేకపోయాయి. శ్రీధర్ బాబు రాష్ట్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మంథని నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రాజెక్టులుపూర్తి,సంక్షేమ పథకాలు ప్రజలకు దరిచేరుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పటి వరకు అందలేదు.పరిహారం కోసం రైతులు నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. మేము పాలకులం కాదు.... సేవకులం అని ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన అన్న మాటలను ఆచరణలో నిర్మించాలని ఈ ప్రాంత విద్యార్థులు,మేధావులు, ప్రజలు,గిరిజనులు, నిరుద్యోగులు, రైతులు, సింగరేణి కార్మికులు, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు. నూతన ముఖ్యమంత్రితోపాటు శ్రీధర్ బాబు పార్టీలోనే సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందడం,ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టడం, పెండింగ్ పనులకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలోని మర్రి వాగు ప్రాజెక్టుకు క్లియరెన్స్ రాకపోవడం, ఇచ్చంపల్లి ప్రాజెక్టు ప్రతిపాదనలకు పరిమితం,మంథని నియోజకవర్గానికి వ్యవసాయ ఇంజనీరింగ్ కాలేజీ,నర్సింగ్ కాలేజీ, గుంజపడుగు మండలంను కాశిపేట మండలంగా ఏర్పాటు,పోతారం, అన్నారం,దామరకుంట, ఉప్పట్ల,వల్లంకుంట, ఎత్తిపోతల పథకాల నిర్మాణం,అర్ధాంతరంగా ఆగిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం, మహాదేవపూర్‌లో ఉన్న మాడ స్థానంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీలు, గిరిజనులు, బంజారీలు, కోరుతున్నారు. మంథనినీ టీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలని,మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల ప్రజల సౌలభ్యం కొరకు గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం,రామగిరినీ పర్యాటక ప్రాంతంగా మార్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. అన్నారం బ్యాక్ వాటర్ వల్ల ముంపుకు గురవుతున్న రైతులకు పంట నష్టపరిహారం, కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టి పూర్తి కాని పనులు శ్రీధర్‌బాబుకు పెద్ద సవాల్‌గా మారనున్నాయి.సవాళ్లను ఎంతమేరకు పూర్తి చేస్తారో వేచి చూడాలి.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- భవిత సెంటర్‌లోని దివ్యాంగులకు ప్రత్యేక సదరం క్యాంపు ఏర్పాటుకు చర్యలు



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పట్టుదలతో ముందడుగు వేసి దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ గ్రౌండ్‌లో జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 10 నుంచి 16 సంవత్సరాల లోపు వయసు, 17 నుంచి 35 సంవత్సరాల వయసు గల దివ్యాంగులకు వేరు వేరుగా నిర్వహించిన ఆటల పోటీల ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రారంభించారు. దివ్యాంగ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన దివ్యాంగులతో కలెక్టర్ కాసేపు క్యారం ఆడి సరదగా గడిపారు. భవిత సెంటర్ దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం క్యాంప్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయని, ఎందులోను మేము ఎవరికి తక్కువ కాదని, అన్ని రకాల ఆటల పోటీలలో పాల్గొని నిరూపించాలని అన్నారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాల క్రింద బ్యాంకు రుణాలు అందించి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని, దివ్యాంగులు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, డీఆర్‌డీవో శ్రీధర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి పాల్గొన్నారు.

కోలిండియా జేబీసీసీఐ ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయిస్తాం

- ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి
- సీఐటీయూలో 50 మంది కార్మికుల చేరిక



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని:
కోలిండియా జేబీసీసీఐ ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయిస్తామని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సింగరేణి ఆర్జీ-1 జీడీకే-2 ఇంక్లైన్‌లో బ్రాంచ్ అధ్యక్షుడు ఆసరి మహేష్ అధ్యక్షతన గురువారం గేట్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ, డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సింగరేణిలో సీఐటీయూను గెలిపిస్తే కోల్ ఇండియా జేబీసీసీఐ ఒప్పందాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, అలవెన్స్లపై ఇన్‌కమ్ టాక్స్ తిరిగి రీయంబర్స్‌మెంట్ చేసి ఇప్పిస్తామని, క్యాడర్ స్కీములు అమలు చేస్తామని, ప్రమోషన్లలో ఇంక్రిమెంట్లు ఇప్పిస్తామని, బదిలీ వర్కర్లకు ప్రమోషన్లలో జరుగుతున్న అన్యాయాన్ని అరికడతామని, హక్కులు రక్షిస్తామని, 190/240 మస్టర్లు నిండిన వెంటనే జనుల జనరల్ మజ్దూరుగా ప్రమోషన్ ఇప్పిస్తామని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల మీద నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతున్న సీఐటీయూ ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డిసెంబర్ 27న జరిగే కార్మిక సంఘం ఎన్నికలలో సీఐటీయూ గెలవాలి సింగరేణిలో మార్పు రావాలని నినాదంతో ముందుకు వచ్చామని, తప్పకుండా సీఐటీయూ యూనియన్ గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పెద్దపెల్లి జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి, ఉపాధ్యక్షుడు నామని బిక్షపతి, బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు మేదరి సారయ్య, మెండే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆసరి మహేష్, ఆరెపల్లి రాజమౌళి, ఎస్కే గౌస్, సిహెచ్.వేణుగోపాల్ రెడ్డి, కారం సత్తయ్య, పిట్ నాయకత్వం వంగల రాములు, తిప్పా రఘు రాజు, విజయ్ కుమార్, తదితరులుటన్నారు. అనంతరం యూనియన్‌లో 50 మంది చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ సంజయ్‌నగర్‌లో రైల్వే ట్రాక్ పక్కన గల ఓపెన్ నాలా నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పెద్దెల్లి తేజశ్వి ప్రకాష్ గురువారం ప్రారంభించారు. పట్టణ ప్రగతి నిధుల నుంచి 10 లక్షల రూపాయలతో ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఓపెన్ నాలా వల్ల సుమారు 30 సంవత్సరాల నుంచి ఇక్కడ ప్రజలు ఈగలు, దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో కార్పొరేటర్‌గా ప్రత్యేక చొరవ తీసుకొని కౌన్సిల్లో ప్రతిపాదించి, కమిషనర్, మేయర్ సహకారంతో నిధులు మంజూరు చేయించి, ఈ పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సీసీ రోడ్డు వేయించడం జరుగుతుందని, ఈ పనుల వల్ల 2ఎ మోరీ నుంచి 5వ ఇంక్లైన్ మోరీ వరకు రింగ్ రోడ్డుగా ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ పెద్దలు ఈర్ల ఓదెలు, కేసరపు రాయపోషం, అడ్డూరి దుర్గయ్య, రత్న సారయ్య, ఈర్ల అమతమ్మ, కండె రాజేశ్వరి, శ్రీకాంత్ తదితరులున్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే విజయరమణారావు



మంత్రి శ్రీధర్ బాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూహౌసింగ్ ,సమాచారం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కలు డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం ఈసీఈ విద్యార్థులు విరాళాలు సేకరించి గురువారం స్ఫూర్తి మానసిక వికలాంగుల కేంద్రంలో దివ్యాంగులకు సోప్స్, షాంపూలు, నిత్యావసర సరుకులు, బ్రెడ్, బిస్కెట్స్, పండ్లు అందించారు. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు సమాజం,సమాజసేవ పట్ల అవగాహన పెంపొందించడం కొరకు నేషనల్ సర్వీస్ స్కీముని ఏర్పాటు చేసి విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమ కళాశాల ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మణి గణేష్, ఏవో సురేష్, రాజిరెడ్డి. ఎంబీఏ సీనియర్ ఆధ్యాపకుడు రామ్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు



నవతెలంగాణ-ముత్తారం:
తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గురువారం ముత్తారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

ఓటర్ జాబితాపై బీఎల్‌వోలతో సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ బండి రాజేశ్వరి

నవతెలంగాణ-ముత్తారం:
ఓటర్ లిస్ట్ స్పెషల్ సమ్మరి రివిజన్‌పై బీఎల్‌వోలతో ముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బండి రాజేశ్వరి గురువారం సమావేశం అయ్యారు. జనవరి 01,2024 నాటికి 18 సంవత్సరాలు పైబడిన యువతీ, యువకులను ఫారం 6 ద్వారా ఓటరు నమోదు చేయాలని, చనిపోయిన, గ్రామం నుంచి వెళ్ళిపోయిన, వివాహము జరిగి వెళ్ళినవారికి ఫారం-7, ఫారం -8 ద్వారా ఇంటి నెంబరు వారీగా కుటుంబం అంతా ఒకే పోలింగ్ కేంద్రం రావాలని సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ భవానీ ప్రసాద్, గిర్దవార్ శ్రీధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే మీకు తోడుగా ఉంటాడు

మనాలీ రాజ్‌ఠాకూర్



మహిళలతో మాట్లాడుతున్న మనాలీ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
ఏ సమస్య వచ్చిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మీకు తోడుగా ఉంటారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి, కాంగ్రెస్ నాయకురాలు మనాలీ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖనిలోని పలు ఏరియాల మహిళలను ఆమె గురువారం కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను భారీ మెజారిటీతో గెలిపించినందుకు ఆమె ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఖాదీ మేళా

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలోని ఆర్జీ-1 ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో ఖాదీ మేళా ప్రారంభం అయ్యింది. గురువారం ముఖ్య అతిథిగా సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై రిబ్బన్ కట్ చేసి, టెంకాయ కొట్టి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదీ వస్త్రాలను వాడటం ద్వారా పరిశ్రమపై ఆధారపడి ఉన్న వారికి ఉపాధి కల్పించిన వారు అవుతారని అన్నారు. ఈ మేళా ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించడం జరుగుతుందని, సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయల వరకు ఖాద వస్త్రాలపై డిస్కౌంట్ రాయితీతో అరువుపై ఇస్తారని తెలిపారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రామ్ మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మి నారాయణ, డీజీఎం సివిల్ నాగేశ్వర్ రావు, సాంబశివరావు, రవీందర్, ఖాదీ గ్రామోద్యోగ్ నిర్వాహకులు మేనేజర్ చంద్రమౌళి, సంపత్, రవీందర్ తదితరులున్నారు.



ప్రారంభిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్